ఓ కోడు రెండు హృదయాలు

ఉన్నట్టుండి సుబ్బరామయ్యకు తాసిల్దారు గారితో పనిబడింది. మరొకరూ, మరొకరూ అయితే చిటికెలో సాధించుక రాగలిగిన పని. కానీ సుబ్బరామయ్య పాలిటి కది కొండల్ని త్రవ్వడమంత కష్టసాధ్యంగా కనిపించింది.

ఉద్యోగుల ముఖం చూడరాదన్నది; కాకపోతే వాళ్ళ ముఖాన పడరాదన్నది సుబ్బరామయ్య ఆదర్శం. వార్తాపత్రిక చూడకుండా వుండడం సాధ్యంగావచ్చు. సినిమాకు వెళ్ళకుండావుండడం సాధ్యంగావచ్చు. వానలో తడవకుండా సాధ్యంగావచ్చు. కానీ, ఈనాటి మానవుడు ఏ రంగంలో జీవిస్తున్నా. ఉద్యోగులతో జోక్యం పెట్టుకోకుండా జీవించడం దుస్తరం। కానీ, సుబ్బరామయ్య విషయం వేరు. ఆరు నూరైనా, నూరు ఆరైనా అతడు తన ఆదర్శంనుంచి ఏనాడూ తప్పటడుగు వేయలేదు.

ఇక్కడెవరికైనా ఉద్యోగుల పట్ల సుబ్బరామయ్యకలాంటి అభిప్రాయం కలగడానికి కారణ మేమైవుంటుందన్న జిజ్ఞాస కలగడం సహజమే। పూర్వగాధ లేకపోలేదు. సుబ్బరామయ్య ఉద్యోగులని గొప్పగా చెప్పుకోదగిన వారెవరూ లేని పల్లెలో పుట్టి పెరిగాడు. గ్రామంలో వున్న మునసబు, కరణము గ్రామ పౌరులుగానే తప్పా, ఉద్యోగులుగా పరిగణింపబడేవారుకారు. ఆ ఊరి పేరు కంకి మిట్ట. గ్రామ కరణం పేరు

శరభయ్య. అతడు సుబ్బరామయ్య తండ్రికి వేలువిడిచిన పెదతండ్రి కొడుకు. అందువల్ల సుబ్బరామయ్యకు పెద తండ్రి వరుస. పాపం, అతగాడికి పిల్లలు లేరు. తనకు పిల్లలు లేకపోతే గానీ, ఎదుటివారి బిడ్డలను ప్రేమతో దగ్గరికి చేరనీయరాదన్న సిద్ధాంతం మనుస్మృతిలో వుందో, లేదో తెలియదు. ఆ సిద్ధాంతానికి అనుగుణ్యంగా శరభయ్య సుబ్బరామయ్యను దగ్గరకు చేరదీసి ముద్దుగా చూచుకుంటూ మురిపాలు ఒలకబోసేవాడు. ముద్దు మురిపాలతో బాటుగా అతడు తన సుగుణ సంపత్తినిగూడా కొంతలో కొంత సుబ్బరామయ్యకు సంక్రమింపజేశాడు.

పేరుకు శరభయ్యేగానీ కంకిమిట్ట కరణం ధాటీగా వీళ్ళయినా మ్రింగడం చేతకాని సాధువు. రివిన్యూ యిన్స్పెక్టరు గ్రామంలోకి రాబోతున్నాడంటే, ఆ ప్రాంతంలో రాజాధి రాజొకడు మకుటం వేయబోతున్నాడన్నంతగా అతడు బెంబేలు పడిపోయేవాడు. కూర్చున్నచోట కూర్చునేవాడు గాడు. నిల్చున్నచోట నిల్చునేవాడు కాడు. రివిన్యూ యిన్స్పెక్టరుగారు రాబోతున్నారని చెప్పుకుంటూ గ్రామమంతా చెడ దిరిగేసేవాడు. రాబోతున్న ఉద్యోగి శాకాహారి అయితే అందుకొక రకమైన ఏర్పాటు. సర్వభక్షకుడైతే అందుకొక విధమైన సన్నాహం. రోడ్డులో బస్సు దిగితే, అక్కడినుంచి పట్టుమని నాలుగు ఫర్లాంగులు లేకపోయినా, ఆ మాత్రం నడచి రావటానికైనా ఉద్యోగి గారి సుకుమారపు ప్రాణం ఒప్పుకోక పోవచ్చునని అందుకోసం ఒక ఒంటెద్దు బండి తయారింపు. అతడు వచ్చి బండి దిగేసరికి, లోపలికి వెళ్ళి పాతకోటు తగిలించుకుని, తలపాగా సర్దుకుంటూ బయటికి పరతెంచి వచ్చేతీరు. ఆపాటికే చంకల్లో పొన్నుకర్ర అమరగా, నడుముదాకా వంగబెట్టి, ముకుళిత హస్తుల్నిగా చేసి తోటి, తలారి వారిని ముందు వెనుకలుగా నిల్చోబెట్టిన పద్ధతి — చిన్ననాడు యిలాంటి దృశ్యాలను తరచుగా చూడడానికి అలవాటు పడ్డాడు సుబ్బరామయ్య.

రివిన్యూ యిన్స్పెక్టరుగారు వెళ్ళిపోయిన తర్వాత, నిండుగా వూపిరి వదిలి అరుగుపైన చతికిలపడిపోయేవాడు శరభయ్య. సుబ్బరామయ్య మెల్లగా అతడి దరసకు చేరేవాడు. సదుపదేశాలప్పుడే ప్రారంభమయ్యేది.

"అదికాదు పెదనాన్నా! రివిన్యూ యిన్స్పెక్టరంటే ఎందుకంత భయం? అతడిచేత తుపాకీ అయినా లేదే! అతడు కనీసం ఎర్రటోపీ అయినా వేసుకోలేదే."

బుల్లివాడి అమాయకత్వానికి శరభయ్య పకాలున నవ్వేసేవాడు" "ఒరేయ్ కుర్రకుంకా! నాకు తెలుసు. నువ్వు చెపుతున్నది పోలీసును గురించి. రివెన్యూ యిన్స్పెక్టరు పోలీసెందుకౌతాడు? ఆయన మరికొంత కాలానికి తాశీల్దారవుతాడు. తాశీల్దారంటే ఏమిటో తెలుసా? తాలూకా కంతా పెద్ద. మనమెక్కడ చూశావుగానీ కోటకొమ్మలో (తాలూకా కేంద్రం) లో తాలూకాఫీసుంది. ఎర్రటి ఇటుకరాళ్ళతో కోట లాంటి కట్టడం. ఇనుప కమ్ముల దర్వాజాలుంటాయి దానికి! నువ్వింం

దాకా చెప్పావే, ఆ పోలీసువాళ్ళు ఆ తలుపుల దగ్గర కాపలా వుంటారు...."

"పోలీసులు కాపలా కాయడమెందుకు నాన్నా?"

"అది తాశీల్దారుగారుండే చోటు గదా! అందుకని...."

"పోలీసులు లేకపోతే, తాశీల్దారుగారు ఒంటరిగా వుండలేడా పెదనాన్నా?"

"ఛా ఛా! ఆయనకేం భయంరా సుబ్బులూ! తాలూకా అంతటా వసూలైనకిస్తీ డబ్బులు అక్కడే వుంటాయి గదూ! ఆ ఖజానాకు పోలీసులు కావలా కాస్తారన్నమాట!"

"ఓయబ్బో! అలాగైతే తాశీల్దారుగారి దగ్గర లెక్కలేనంత డబ్బుంటుందన్నమాట!"

"ఉంటుందిగానీ, ఆ డబ్బు ఆయనది గాదురా సుబ్బులూ! గవర్మెంటుది...."

"గవర్మెంటా? వాడెవడు పెదనాన్నా? తాశీల్దారుకంటే గొప్పవాడా ఏమిటి?"

ఇలాంటి చొప్పదంటు సందేహాల వల్ల గవర్మెంటుయొక్క ఘనతకేదో అపచారం జరిగిపోయినట్టుగా నొచ్చుకునేవాడు శరభయ్య - "గవర్మెంటంటే మనిషి కాదురా సుబ్బులూ! అదొక సంస్థ. తెలుగులో ప్రభుత్వం అనడం దాన్నే! తాలూకా కొక తాశీల్దారుంటాడా! అలాంటి తాశీల్దారులు పది పన్నెండుగురికి పైన కలెక్టరుంటాడు. జిల్లాలో అతడి అధికారానికి తిరుగుండదు. ఎంత కొమ్ములు తిరిగిన తాశీల్దారయినా సరే, కలెక్టరుగారి ఎదుట గడగడలాడి పోవలసిందే! అంతెందుకు? గవర్మెంటొక కొండలాంటిదనుకో! అందులో నేను - అంటే గ్రామ కరణాన్ని - ఒక చిన్న గులకరాయిలాంటి వాణ్ణి. రివిన్యూ ఇన్స్పెక్టరొక గుండ్రాయిలాంటి వాడనుకో. అప్పుడు తాశీల్దారు ఒక రుబ్బురాయంతటి వాడు. రెండు చేతులతోనూ అప్పళించుకోడానికి వీల్లేని పెద్ద గుండుంది చూచావూ, కలెక్టరు నంతటి వాడనుకోవచ్చు...."

"మరైతే కొండల్లో అంతకంటే పెద్ద గుండ్లుండవా పెదనాన్నా?"

"ఎందుకుండవు. వాళ్ళే గవర్నర్లు. మనం దేవుళ్ళ నేనాడైనా చూచామట్రా సుబ్బులూ? నే నొకసారి గవర్నరు దొరగారిని చూచాను. రాజ్యమేలడానికి పుట్టినవాళ్ళు అలా వుంటారేమో! అబ్బ, ఏం మీసాలు! ఏం ఠీవి! కారులోనుంచి దిగి హుందాగా చేతులూపుకుంటూ, అలా అలా మందగమనంతో వచ్చి బంగళాముందు నిల్చున్నాడు. నిలువెత్తు భారీ మనిషి. ఆయనొక వూడల మర్రిలా వున్నాడనుకో! ఆయన ఎదుట కలెక్టర్లు కానుగ చెట్లు.

తాశీల్దారులూ తమ్మిచెట్లు. రి వి న్యూ యిన్స్పెక్టరులు గరికపోచలు. మరి మాలాంటివాళ్ళ దేముంది? మేము లెక్కలోనివాళ్ళం కాము...."

"అలాగైతే ఈ రాజ్యమంతా గవర్నరుదేనా పెదనాన్నా?"

"అబ్బే. అతడు గూడా ఉద్యోగస్తుడే! అలాంటి గవర్నరులందరూ వైస్రాయికి సలాములు చేయాలి మరి! చెప్పుకోవడమేగానీ వైస్రాయిని ఎవరు చూచారురా సుబ్బులూ! ఎక్కడో ఢిల్లీలో వుంటాడుట! ఢిల్లీ, ఢిల్లీ అనడమేగానీ అదెల్లా వుందో ఏమిటో! రైల్లో వెళ్ళిరావాలంటే టిక్కెట్టుకే వంద రూపాయలు కావాలిట!"

"ఆ వైస్రాయి ఇంకొకరికి భయపడాల్సిన అవసరం వుండదా పెదనాన్నా?"

"ఎందుకుండదు! వైస్రాయి రాజుగారికి జవాబు చెప్పుకోవాలిగదా! తెలియదట్రా సుబ్బులూ! మనదేశానికి రాజు ఇంగ్లాండులో వుంటారు. మృగాల్లో సింహం రాజుగదూ! చుక్కల్లో చంద్రుడు రాజుగదూ! నరమానవులకు ఆయన అలాంటి రాజన్నమాట! అందరూ ఆయనకే భయపడాలి. ఆయన ఒకరికీ భయపడరు. అందరూ ఆయనకి జవాబుచెప్పుకోవాలి. ఆయన ఒకరికి జవాబు చెప్పరు...."

ఈ అధికారోపనిషత్తును శ్రద్ధగా విన్నందుకు ఫలితంగా సుబ్బరామయ్య లేతబుర్రలో ఒక తిరుగులేని అభిప్రాయం నెలనాటుక పోయింది.

తాను బ్రతికితే ఆ మహారాజు లాగైనా బ్రతకాలి. (ఆయన ఒకరికి భయపడడు గనుక!) లేదా అసలు సివలు సుబ్బరామయ్య లాగైనా బ్రతకాలి. (తానొకరికి భయపడవలసిన అవసరం లేదుగనుక!) అంతేగానీ వెళ్ళి వెళ్ళి సాలీడుగూటిలో తగులుకున్న ఈగలా ఉద్యోగుల చట్రంలో యిరుక్కోకూడదు!

కానీ సుబ్బరామయ్య తండ్రికి మాత్రం తన కుమారుడు ఉద్యోగాలు చేసి, ఊళ్ళేలాలన్న కోరిక మిక్కుటంగావుండేది. మెట్రిక్కుదాకా చదువుకుంటే సబ్ యిన్స్పెక్టరు గావచ్చు. శిరస్తాదారుగావచ్చు. కలెక్టరాఫీసులో హెడ్డు గుమాస్తా గావచ్చు. దేవుడు దయదలిస్తే యింకా ఏమైనా కావచ్చు. ఈ ఆశతోనే అతడు సుబ్బరామయ్యను హైస్కూల్లో చేర్పించాడు. ఆనాటికింకా హైస్కూళ్ళు తామరతంపరగా పల్లెలకు, పేటలకు దిగుమతి కాలేదు. దగ్గరలో వున్న హైస్కూలు జిల్లా ముఖ్య పట్టణంలో వుండేది. సుబ్బరామయ్య ఆ హైస్కూల్లోనే చేరాడు. చేరాడేగానీఅతడు హైస్కూలు చదువును తీరామారాతుదముట్టించలేదు. మధ్యంతరంగా చదువుకు స్వస్తి చెప్పి, యింటికి తిరుగు ముఖం పట్టాడు.

పట్టణంలో గడపిన ఆ అయిదారేళ్ళలోనూ, సుబ్బరామయ్యకు ఉద్యోగుల ప్రపంచాన్ని గురించి మరికొన్ని విషయాలు తెలిసొచ్చాయి.

బడిమామూలుగానే జరిగిపోయింది అంటే చెప్పటానికి అలవాటుపడిన అయ్యావారు పాఠాలు చెబు

తూనే వుంటాయి. చెప్పనివాళ్ళు చెప్పనే చెప్పరు. ఉన్న మంచి చెడ్డ అన్నిటిలోనూ, నిమ్మళంగా సాగిపోతున్న పాఠశాలలో సంవత్సరానికి కొకసారి ఎక్కడలేని సంచలనం బయలుదేరుతుంది. బూజు దులపడం, గోడలకు వెల్ల వేయడం, తాతల కాలంనాటి పాత పటాలను వెలుపలికి తీయడం, రంగు కాగితాలతో తోరణాలు కట్టడం, వారం రోజులపాటు ఒకటే సందడి! పెళ్ళి పనుల పాటు, కుర్చీలో కునికిపాట్లు పడడం అనేక విధాయక కృత్యంగా అలవాటు పడుతున్న మేష్టారు సైతం ఆ వారం రోజులపాటు నిలుచునే పాఠాలు చెబుతారు. అలవాటుగా తప్పితే బడికి రాని మేష్టారు పదిగంటలకు ముందే కాంపౌండులో కాలు పెడతాడు! ఏమిటో మార్పు? బడి ఎల్లప్పుడూ ఇలాగే జరిగితే ఎంత బాగుండేది.

బడి ఎప్పుడూ యిలా జరగాలనుకోడమే తప్పు! సంవత్సరానికి కొకసారి యిలాంటి చైతన్యం నీటి బుడగలా అంతలో పుట్టి, అంతలో చిట్లిపోవడమే ఒప్పు అంటూ తేల్చి చెప్పేవారు అనుభవజ్ఞులు.

ఎందుకంటే—

పై అధికారి ఏడాది పొడుగునా బడిని తనిఖీ చేయడం లేదు!

కానీ బడి సక్రమంగా జరగడం పై అధికారి సంతృప్తి కోసమా? విద్యార్థుల అభివృద్ధి కోసమా?

విద్యార్థుల అభివృద్ధి! అబ్బే, ఉద్ధారకుడు బయల్దేరాడు. బడి క్రమంగా జరిగితేమాత్రం విద్యార్థు లందరూ అభివృద్ధి చెందిపోతారన్న నమ్మకమేముంది?

ఏడాదికొకసారి యిలాంటి హంగామా జరిగితే పై అధికారికి సంతృప్తి కలుగుతుంది సరస్వతి బ్రహ్మాండంగా నిర్వహింపబడుతోందన్న కితాబు లభిస్తుంది. ఆ కితాబు నొక తక్కెడలోనూ, వెయ్యిమంది విద్యార్థుల అభివృద్ధి నొక తక్కెడలోనూ వుంచి తూచుకుంటే, త్రాసు నిస్సందేహంగా మొదటివైపుకే మొగ్గుతుంది!

తన అంతరంగంలో పై అధికారికి వందన సహస్రాలు సమర్పించుకునేవాడు సుబ్బరామయ్య.

"ఓయీ పై ఉద్యోగీ! భూగోళం ధర్మమన్న యిరుసు చుట్టూ తిరుగుతోందని చెబుతుండే వాళ్ళు పూర్వులు. ఇప్పుడా ధర్మం ఏమైందో తెలియదు. ఇప్పుడీ భూవలయానికి యిరుసువి నువ్వు. నువ్వు చండశాసనుడివి. మవ్వాకడివి వున్నావు గనుకనే, ఈ పాఠశాలలు, ఈ ఆఫీసులు మొదలైనవి ఈ మాత్రంగానైనా పని చేస్తున్నాయి? నువ్వూ నీపై ఉద్యోగికి భయపడబట్టేగదా!"—అనుకునేవాడు సుబ్బరామయ్య.

కొందరు క్రింది ఉద్యోగులు పై ఉద్యోగికి అంతగా భయపడరు. కేవలం కర్తవ్య నిష్ఠవల్లనే గట్టెక్కవచ్చు. నను కుంటారు. అలాంటి వాళ్ళను పై ఉద్యోగి నిర్దాక్షిణ్యంగా అట్టడుగుకు ముంచివేయ జూస్తాడు. మరికొందరు క్రింది ఉద్యోగస్తులు కర్తవ్యాన్ని

చోటనుంచి, కేవలం ధూప దీప నైవేద్యాల వల్లనే పై ఉద్యోగిని ప్రసన్నుణ్ణి చేసుకోజూస్తారు. జగన్నాటకంలో వీళ్ళ పాచిక పారకపోలేదు. మానవులందరూ సమానులనుకోడం కద్దు! ఈ సమానత్వం భగవంతుడు పుష్కలంగా ప్రసాదించిన గాలిని పీల్చుకోడం ఒకదానిలో తప్ప మరెందులోనూ కనిపించదు. పై వారికీ, క్రిందివాడికీ వున్న తేడా పై వాడినెంత తర్కాణ్ణిగానైనా చేస్తుంది. క్రిందివాడిని ఎంత పనికిమాలిన వాణ్ణిగానైనా చేయగలుగుతుంది.

కానీ, ఈ తేడా ఒకచ్చే కాడలోనుంచి రెండురకాల పువ్వుల్ని పుట్టించగలదని మాత్రం సుబ్బరామయ్య ఆనాడూహించనైనా లేదు!

* * *

పులి కడుపున పులిపిల్లే పుట్టినట్టుగా, మేక కడుపున మేకపిల్లే పుట్టినట్టుగా సుబ్బరామయ్య కడుపున ముమ్మూర్తులా సుబ్బరామయ్య లాంటి కుమారుడే పుట్టాడు. ఆ అబ్బాయి బట్టకట్టి బడికి వెళ్ళనేర్చిన కాలానికి కంకిమిట్టకొక క్రోసెడు దూరంలోనే హైస్కూలు వెలిసింది. అందువల్ల చదువులకోసం ఇంటికి దూరం కావలసిన అవసరం లేకపోయింది. కుర్రవాడు గూడా బుద్ధిగా చదువుకున్నాడేమో, స్కూల్ ఫైనల్ దాకా రథాన్ని సాఫీగా లాక్కొచ్చేశాడు. అంతవరకు అక్షరాలా ఆ తండ్రికి తగ్గ కొడుకేనని పించుకుంటూ, తండ్రి గీచిన గీటుపైనే సాగిపోతున్న ఆ కుర్రవాడి బుది స్కూలు ఫైనల్ ప్యాసై, సర్టిఫికెట్లు చేతికి రాగానే తటాలున 90 డిగ్రీల కోణంతో వక్రించింది. అతగాడు కాషు ఉద్యోగం చేయవలసిందే. చేసి తీర వలసిందే నన్నాడు. రైతు కొడుకు రైతే కానవసరం లేదు. అతడు ఉద్యోగం చేయదలచుకుంటే ఈ సర్వస్వతంత్ర ప్రజారాజ్యంలో అడగలిగిన దేదీ లేనేలేదన్నాడు. అనడంతో ఎక్కడూరుకున్నాడు! తనకు తానై స్వప్రయోజకత్వం వెలిగించి ఏవేవో ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకున్నాడు. అందులో ఒకచోటనుంచీ ప్రత్యుత్తరం గూడా రానేవచ్చింది. ఉన్న సర్టిఫికెట్లన్నింటికీ నకళ్ళు తీయించి, స్థాయిలో తాశీల్దారుకు తగ్గని గెజిటడ్ ఆఫీసరు దగ్గర సంతకం చేయించి వారం రోజుల్లో చేరేటట్టుగా అప్లికేషను పంపుతుంటే దరఖాస్తుదారుడికి ఇంటర్వ్యూ తేదీ తెలుపబడుతుందని ఆ ప్రత్యుత్తరం నివేదించింది. లక్ష్మణుడు మూర్ఛ మునిగిన సమయంలో రావలసివచ్చిన సంజీవనిలా, ఇప్పుడు గెజిటడ్ ఆఫీసరుగారి సంతకం కావాలి! ఎక్కడ దొరుకుతుందది! ఎలా దొరుకుతుందది!

కోట కొమ్మలలో తాశీల్దారుగారి ఆచూకీని గురించి తెలియచెప్పడానికిప్పుడు శరభయ్యగారు సజీవులై లేరు.

"ఒరే సుబ్బి! నేనెన్నడూ ఆఫీసుల వెంట తిరగలేదు. నీ పాట్లేవో నువ్వే పడు. కావలిస్తే అయిదో, పదో యిస్తాను. తీసుకెళ్ళు...." అన్నాడు సుబ్బరామయ్య.

అబ్బాయికి ఉద్యోగమంటే ఇష్ట

మేగాని. ఉద్యోగులంటే బెదురులేక పోలేదు. ఆ పని ససేమిరా తనవల్లకాదు పొమ్మన్నాడు. కుమారులకు ఉద్యోగాలు సంపాదించి పెట్టే ప్రయత్నంలో అక్కడక్కడా కొందరు తల్లి దండ్రులు, మునుపటికి రావణాసురుడు కైలాసాన్ని పెల్లగించినట్టుగా, ప్రభుత్వాన్నే కదిలించి వేస్తున్న ఉదంతాలను సోదాహరణంగా వివరించాడు

సుబ్బరామయ్యకు గత్యంతరం లేకపోయింది. అతడు తాశీల్దారుగారి కోసం బయలుదేరక తప్పలేదు.

సుబ్బరామయ్య తన జీవితం పొడుగునా మహదాశ్చర్యకరమైన సంఘటనలనెన్నింటినో చూశాడు. మూతలేని పెట్టె ఒకటి మాటల మూటగా, పాటల పేటికగా పనిచేయడం అతని కెనలేని విస్మయాన్ని కలిగించింది. తెరగుడ్డపైన బొమ్మలాడడం మాత్రమేగాదు, మాటాడడంగూడా అతడు విన్నాడు. కూతవేటు దూరమన్నది ఒక ఫర్లాంగు దూరంనుంచి, యోజనాలకు యోజనాలే అధిగమించడం అతడి జీవితకాలంలోనే జరిగింది. సుబ్బరామయ్య కంతగా ఆశ్చర్యం కలిగించినవాటిలో, కోటకొమ్మలయొక్క పెంపుదలతో కానవచ్చిన పరిణామ క్రమంగూడా ఒకటి. పాతికేళ్ళకు మునుపు ఒక పెద్ద పాళెగాడు వేటకోసం వచ్చి అడవిలో వేసుకున్న నలుగైదు గుడారాలకు మల్లే ఆ గ్రామంలో చెదరు చెదరుగా కొన్ని యిళ్ళు కనిపించేవి. ఒళ్ళు వంచి పని చేయడంవల్లనైతేనేమి, పైవారి కృపాకటాక్షం అవ్యారిగా లభించడంవల్లనైతే నేమి, తొందర తొందరగా ప్రమోషన్లు అందుకుని పైమెట్టుకు చేరుకోగలిగిన ఉన్నతోద్యోగిలా కోటకొమ్మల గ్రామం కాలంతో పందెం వేసుకుని పట్టణంగా పరిణమించింది. పంచల స్థానాన్ని ప్యాంటు లాక్రమించుకున్నట్టుగా పాత యిండ్ల శిథిలాలపైన అందమైన సిమెంటు మేడలు వెలశాయి. నిగనిగలాడే నున్నటి క్రాపింగులా తారురోడ్లు ఏర్పడ్డాయి. పెట్టెలు, పట్టె మంచాలు, గవాక్షాలకు గుడ్డలు, గడప దగ్గర గుట్టలాంటి పాదరక్షలు; చలువరాతి బొమ్మలు, చదువబడిన పుస్తకాలు, సుఖాసనాలు. స్థూలకాయాలు మొదలైనవి ఉన్నతోద్యోగి యింటికి హంగులు. పట్టణానికి గూడా దానికి కావలసిన హంగులు దానికి లేకపోలేదు బంకులు, షాపులు, సినిమాలు, హోటళ్ళు, ఆట మైదానాలు, ఉద్యానవనాలు మొదలైనవన్నీ కోటకొమ్మలలో చోటుచేసుకున్నాయి.

పదిమందిని వాకబుచేసి, పదివీధులు తిరిగిన తర్వాతగాని సుబ్బరామయ్య తాశీల్దారుగారి యింటిని కనిపెట్టలేకపోయాడు. దొంగలు ఆలీబాబా యింటిని గుర్తుపట్టలేక పోవడానికి కారణమేమిటో పాఠకులకు తెలుసు. అప్పులకని, ఆహారానికని, యింకా మరికొన్నింటికని అదనంగా కొందరు తాశీల్దారులు ఏర్పడి వుండడంవల్ల అసలు తాశీల్దారుగారి యింటిని వెదకిపట్టుకోడంలో కొంత ఆలస్యమే వాటిల్లింది.

పట్టణంలోని యిండ్లకు వాస్తు

శాస్త్రానికి బొత్తిగా సంబంధం వున్నట్టు తోచదు. సంగీతం రానివాళ్ళు పాడడం వల్ల అధిదేవతలకు వికృత రూపం వాటిల్లిందని చెప్పనేర్చిన మన పెద్దలు, నగరాలలోని గృహనిర్మాణంవల్ల వాస్తు పురుషుడు చిత్రహింసలకు గురౌతున్నాడని ఎందుకు చెప్పలేదో మనకు తెలియదు! ముక్కోణాకారంగా ఒక జాగా కనిపించినాసరే, అక్కడొక కట్టడాన్ని లేవదీసే కక్కుర్తి పట్టణాలలోనే కనిపిస్తుంది. సూదిగొంతు, బానకడుపు అన్న సామెతకు రూపకల్పనలాగా తాసిల్దారుగారి యిల్లు వెడల్పు తక్కువ. పొడవెక్కువ. వీధిలో నిల్చున్నవారికి ఆ యింటితాలూకు వరండా కనిపిస్తుంది. నాలుగడుగుల మేరకు గోడ. దానిపైన యినుప కమ్మల అల్లిక. మూయబడివున్న రెక్కతలుపులు. ఈ యింటిలో మనుషులనేవాళ్ళున్నారా? ఉంటే ఎక్కడున్నారు? ఇంతకూ తాసిల్దారుగారున్నట్టా, లేనట్టా? ఎవరు చెబుతారు?

పదిపదిహేను నిమిషాలు వేచిచూచిన తర్వాత సుబ్బరామయ్య ఒక్కింత సాహసానికి పూనుకుని రెక్కతలుపు మీద చెయివేసి చూచాడు. లోపల గడియ పెట్టలేదేమో, తలుపు మెల్లగా తెరచుకుంది. అనుమతి పత్రం లేకుండా విదేశంలో అడుగు పెడుతున్న పరదేశీయుడిలా సుబ్బరామయ్య మెల్లగా లోపల కాలుమోపాడు.

విశ్చల కాసారంలో సంచలనం చెలరేగడానికి ఒక చిన్న గులకరాయి పడినా చాలు. సుబ్బరామయ్య వరండాలో అడుగుపెట్టిన మరుక్షణంలో గ్రామసింహ గర్జన ఒకటి ఉన్నట్టుండి ఉద్వేలంగా చెలరేగింది. సుబ్బరామయ్య—ఒక్క ఉదుటున బయటికి లంఘించేవాడే! కానీ ఆ కుక్క ఓ గొలుసుకు గట్టిగా బంధింపబడి వుండడం అతడి కొంకొంత ధైర్యాన్ని చేకూర్చింది. ఇజ్జూ.. జూ.... అంటూ అతడొక రకంగా కుక్కను సముదాయించడానికి కూడా ప్రయత్నించాడు. పరాయి వ్యక్తి తన ఎదుటి నుండి నిష్క్రమించేదాకా ఆ కుక్క నోరు మూసే ధోరణిలో లేదు. ఒరుల సాయం లేకుండా కుక్కలను వూరుకోబెట్టడమెలాగో సుబ్బరామయ్యకు తెలియదు....

ఆ ఆపత్సమయంలో, టైగర్. అంటూ ఓ అదలింపు వినిపించడమేమిటి, టైగర్ నోటికి తాళం పడట మేమిటి రెండూ ఒక్కసారే జరిగాయి. వరండాలో ఓమూలగా వేయబడివున్న వాలు కుర్చీపైన పది పన్నెండేళ్ళ కుర్రవాడొకడు పవ్వళించి వున్నా డన్నవిషయం గూడా సుబ్బరామయ్య కప్పుడే తెలిసింది....

"తాసిల్దారుగా రున్నారా బాబూ?" సుబ్బరామయ్య వీలైనంత వినయంగానే ప్రశ్నించాడు.

"అప్పుడే తెల్లవారిందా?" అంటూ ఆప్రశ్నకు ప్రత్యుత్తరంగా యింకొక ప్రశ్న వెలువడింది.

సుబ్బరామయ్య విస్తుపోయాడు. గంట ఎనిమిదికావస్తున్నది. ఇంకాతెల్లవారక పోవడ మేమిటి? తొలి కోడి

కూయగానే తెల్లవారిందనుకోడం పల్లెల్లో సాంప్రదాయం. ఇక్కడెన్ని గంటలకు తెల్లవారుతుందో తనకు తెలియదు.

ఐనా ఆ అనవసరమైన గొడవ తనకెందు కన్నట్టుగా సుబ్బరామయ్య మళ్ళీ అసలు విషయంలోకే వచ్చాడు. "తాసిల్దారుగారితో కాస్త పనుండి వచ్చాను. ఆయన్నొకసారి కలుసుకోవాలి...."

"అందుకు నా పర్మిషన్ దేనికి?"

"పర్మిషన్ కాదు. తాసిల్దారుగారు యింట్లో వుంటే కలుసుకోవచ్చుననీ.."

"అవునుమరి. ఇంట్లోవుంటే కలుసుకోవచ్చు. లేకుంటే కలుసుకోవడం సాధ్యంకాదు. అన్నివిషయాలూ నీకు తెలిసేవున్నాయి. మరైతే నన్నడగడ మెందుకూ?"

"అదికాదు బాబూ!"

"ఏది కాదు?"

సుబ్బరామయ్య నిరుత్తరుడై పోయాడు. వివాదపరిష్కారం కోసం ప్రపంచ రాజ్యాలు కొన్ని చర్చలు జరుపుకోవడం కద్దు. ఏ ప్రాతిపదిక పైన ఆ చర్చలు జరగాలన్నది మొట్ట మొదటి సమస్య. ప్రాతిపదిక మాట దేవుడెరుగు. వివాదం పరిష్కారం కావాలన్న సదుద్దేశం ఉభయ వర్గాలలో ఏ ఒక్కదానికి లేకపోయినా చర్చలొక ప్రహసనంగా పరిణమించడం సంభవమే! కుర్రవాడితో సుబ్బరామయ్య సంభాషణ అంతకంటే మెరుగ్గా లేదు.

పదినిమిషాలవరకూ సుబ్బరామయ్య మౌనంగా వుండిపోయాడు. తాసిల్దారు గారు లోపలవున్న పోలకువలేవీ కావ రావడంలేదు. మౌనవ్రతాన్ని పాటిస్తూ నిలువుకాళ్ళశిక్ష అనుభవిస్తూ తానెంత కాలం యిలా తాసిల్దారుగారింటి వసారాలో గడపవలసి వున్నదో అతనికి బోధపడలేదు. 'ధైర్యే సాహసే లక్ష్మీః' అన్నారు పెద్దలు. మళ్ళీ ఒకసారి ఆ కుర్రవాణ్ణి కదిపి చూడదలచుకున్నాడు సుబ్బరామయ్య.

"చూడు బాబూ! ఒకవిషయం తెలిస్తే చాలునాకు! అయ్యగారు యింట్లోవున్నట్టులేరు. ఆయన ఎప్పుడు వస్తారో తెలిస్తే వెళ్ళిపోతాను...."

చదువుతున్నపుస్తకాన్ని టేబిలుపైకి విసరి ఆ కుర్రవాడు సుబ్బరామయ్య వైపొకసారి తీక్షణంగా చూచాడు— "ఆయనెప్పుడొస్తారో నాకేం తెలుసు? గంటల్ని తెలిపే గడియారంలా నేను తాసిల్దారుగారి రాకపోకల్ని తెలిపే యంత్రాన్ని గాను...."

సుబ్బరామయ్య ముఖాన ప్రత్యేకంగా చింతపిక్కు చల్లవలసిన అవసరం లేకపోయింది! అచట పుట్టిన చిగురు కొమ్మయిన చేవ. అంటూ ఒక పద్యాన్ని ఎక్కడో చదివినట్టు జ్ఞాపకం! బహుశా ఆ మాటను యిలాంటి వాళ్ళను గురించే అన్నారేమో! ఇంతకూ ఒకరినని ఏం లాభం? పల్లెలో తానా కుర్రకుంకను చదివించకుండా పొలం దారి పట్టించి వుంటే యిలా నామర్దా పాలు కావలసివచ్చేది గాదు.

కత్తివేటుకు నెత్తురుచుక్క లేని

ముఖంతో సుబ్బరామయ్య వెలుపలికి వచ్చాడు. మతిచెడిన వాడిలా బజార్ల వెంట తిరిగాడు. ఎండకు మగటిమి హెచ్చి, గంట పదిన్నర కావస్తుండగా సుబ్బరామయ్య కొక విషయం జ్ఞప్తికి వచ్చింది. ఉదయం ఆరింటికల్లా సూర్యుడు పూర్వాద్రి శిఖరాన పొడ చూపినట్టుగా పది గంట లయ్యేసరికి ఉద్యోగు లందరూ ఆఫీసుకు చేరుకోక పోరు. తాసిల్దారుగారిని సంధించ డాని కదే సజావైన పద్ధతి....

సుబ్బరామయ్య వెళ్ళేసరికి తాలూకాఫీసు ప్రాంగణం జనంతో కిటకిట లాడి పోతోంది. అప్పు డప్పుడే గుమస్తాలు కుర్చీలలోకి సర్దుకుంటున్నారు. వసారాలో తనకు తారసిల్లిన మొదటి బంట్రోతునే అడిగి చూచాడు సుబ్బరామయ్య— "బాబ్బాబూ! తాశీల్దారుగారిని కలుసుకోవడానికెప్పుడు వీలవుతుందో తెలుసుకోవాలి. ఆయనతో కాస్త పనుండి వచ్చాను" అన్నాడు.

పల్లెటూరి వాలకాలతో వ్యవహరింప వలసి వచ్చేసరికి బంట్రోతులే గెజటడ్ ఆఫీసర్లు. సుబ్బరామయ్య వైపొకసారి ఎగాదిగా చూచాడు జవాను— "ఆ కాడికి నువ్వొక్కడివే పనులున్న వాడివి. ఇక్కడ తాసిల్దారుగారికిగానీ, నాకుగానీ పనులు లేవనుకుంటున్నా వేమిటి?"

"అబ్బే, నేనామాట అనలేదే!" చిక్కమొగం పెట్టాడు సుబ్బరామయ్య.

"ఐతే, నా మామూలు నా కిలా పడేయ్...."

మారుమాట లేకుండా ముడుపు చెల్లించుకున్నాడు సుబ్బరామయ్య.

వివరాలు వెల్లడింపబడ్డాయి—

తాసిల్దారుగారు ఊరిలో లేరు. క్యాంపుకు వెళ్ళారు. సాయంకాలానికి తిరిగి రాగలరు. బడలికతో వుంటారు గనుక అప్పటికప్పుడు ఆయనను సందర్శిస్తే పని సానుకూలం గాకపోవచ్చు. రాత్రి భోజనానంతరం ఆయన కెవరితోనైనా కాసేపు బాతాఖాని వేయాలని వుంటుంది. భోజనం చేసి వచ్చి నింపాదిగా తాంబూలం సేవిస్తూ ఆయన వరండాలో కూర్చుంటారు. ఆయనను కలుసుకోడాని కదే అనువైన సమయం ...

సుబ్బరామయ్య మళ్ళీ రోడ్డు పై కెక్కాడు. కనిపించిన హోటల్లోకి వెళ్ళి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని తిన్న శాస్త్రం ముగించాడు. ప్రొద్దు పోయేటంతవరకూ పుర వీధుల్ని సర్వే చేశాడు. గళ్ళతో నిండిన వినీల వవనాలను ప్రేలాడదీసినట్టుగా, చిరుచీకట్లు ముసురుకోసాగాయి. సుబ్బరామయ్య కాళ్ళు అతడి నొకచోట నిలువనీయడం లేదు. అవి అప్రయత్నంగా అతణ్ణి తాసిల్దారుగారు నివసిస్తున్న వీధిలోకే తీసుకునివెళ్ళాయి. హఠాత్తుగా ఒక చోట నిల్చుని ముందువెనుకలు చూచుకునేసరికి అతడు తాసిల్దారుగారి యింటి ఎదుటనే వున్నాడు.

సూ దితో పొడిచినట్టుగా సుబ్బ రామయ్య క్కిప్పుడో విషయం జ్ఞప్తికి వచ్చింది. ఉదయం కనిపించిన ఆ కుర్ర వాడు. ఆ తర్క విన్యాకుళుడు. ఆ బాల మేధావి మళ్ళీ వరండాలో కని పిస్తే అతనితో మాట్లాడడం తన చేత గాదు. భగవంతుడి అనుగ్రహంవల్ల అతగా డక్కడ లేకుంటే చాలు. అదే పది వేలు !

తక్కతూ, తారుతూ, వీధి గుమ్మం లోకి వెళ్ళి లోపలికి తొంగిచూచాడు సుబ్బరామయ్య.

"ఎవరండీ ? ఏం కావాలి ?"

సౌజన్యం వుట్టిపడుతున్న కంఠ స్వరం. గగనంనుండి భూపతనమై పోతున్నవాడికి అంతర్మధ్యంలో ఒక పూల సెజ్జ దొరికినట్టున్న పలకరింపు. ఆ మాటలు నిజంగానే తనకు విని పించినట్టుగా తానొక భ్రమాప్రమాదానికి లోనయ్యాడా ?

సుబ్బరామయ్య నలా పలకరించిన వ్యక్తికి పాతికేళ్లుంటాయి. ఆ యువ కుడు వాలుకుర్చీలో కూర్చుని వార్తా పత్రిక చూచుకుంటున్నాడు....

"నిలబడిపోయా రెందుకు ? అదిగో, బెంచీపైన కూచోండి...."

"అయ్యగా రున్నారా బాబూ !"

"ఏవో కాగితాలు చూచుకుంటు న్నారు. ఆ పని కాగానే కలుసు కుందురుగాని. అలా కూచోండి...."

పది నిమిషాల్లో ఆతడు పత్రిక చూడడం పూర్తిగావచ్చింది. కళ్ళజోడు సర్దుకుంటూ అతడు ప్రశ్నించాడు—

"ఆఫీసులో కలుసులేకపోయారా ?"

"వెళ్ళాను. క్యాంపు వెళ్ళారని తెలిసింది. ఉదయం యిక్కడికే వచ్చాను. అప్పుడింట్లో లేరు...."

"ఏ వూరునుంచి వచ్చారు ?"

"మాది కంకిమిట్ట. అబ్బాయి స్కూల్ ఫైనల్ ప్యాసయ్యాడు. ఏదో ఉద్యోగంకోసం అప్లికేషన్ పెట్టాడు. గెజటెడ్ ఆఫీసరుగారి సంతకం కావల్సి వచ్చింది...."

"కంకిమిట్ట అన్నారు గదూ ! మీ అబ్బాయి బహుశా తాళ్ళపూడి హైస్కూల్లో చదువుకుని వుంటాడు. మార్కులెలా వచ్చాయి ?"

"నాలుగు వందలకు పదో పది హేనో తక్కువ."

"కాలేజికి పంపలేకపోయారా ?"

"అబ్బో, పసుగకు ఆహారం అందించగలమా బాబూ ! పెద్ద కొండ లకు నన్నలు వేయదలచుకోలేదు. ఎవడి కెంత ప్రాప్తమో అంతే దక్కాలి మరి !"

"అది చాలా పాత సిద్ధాంతం ! ఎవడికేది అవసరమో వాడి కది

దక్కాలి. ఎవడికెంత అవసరమో వాడి కంత దక్కాలి. చదువుకోగలిగిన వాటికి అవకాశాలు లేవు. చదువుపైన బొత్తిగా ధ్యాసలేనివాడికి అవకాశాలు దండిగా వున్నాయి. ఎలా వుందంటారు! అజీర్ణ రోగికి విందు భోజనాలున్నూ, ఆకలిగొన్నవాడికి ఉపవాసాలా ?"

"ఇదిగో శంకరం! ఎవరితో మాట్లాడుతున్నావు ?"

శంకరం లేచివెళ్ళి కిటికీలోనుంచి లోపలికి చూస్తూ "మీకోసం ఎవరో వచ్చారండీ నాన్నగారూ! సంతకం కావాలిట!" అన్నాడు.

"నా కిక్కడ బోలెడన్ని కాగితా లున్నాయి మరి!"

"గంట ఎనిమిది దాటితే ఈ వూరి హోటళ్ళలో భోజనా లుంటాయటండీ నాన్నగారూ! ఉసూరుమంటూ వస్తు వరుకోవలసిందే!"

"అవునవును. ఆ మాటా నిజమే! ఎవరతను? లోపలికి రమ్మను..."

ఎదుటనున్న కాగితాలను అవ్వలికి తోసి, తాసిల్దారుగారు భేటీ యివ్వడానికి సిద్ధంగా కూర్చున్నారు. సుబ్బరామయ్య గూడా గదిలోపలికి వెళ్ళాడు. శంకరం గుమ్మంలోకి వచ్చి వీధి వైపు చూడ సాగాడు.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడచి పోయాయి.

అలాంటి సందర్భాల్లో తాసిల్దారు గారు అడగవలసిన ప్రశ్నలు చాలా వున్నాయి. ఎవరు నువ్వు? ఏ వూరు? వి. యం. సర్టిఫికెట్టు ఎక్కడ? రివెన్యూ యిన్స్పెక్టరు రుజువు పరిచాడా?.... అలాంటి ప్రశ్న లేపీ శంకరానికి వినిపించలేదు. నాన్నగారేం చేస్తున్నట్టు?

శంకరం మళ్ళీ కిటికీదగ్గరికి వెళ్ళాడు.

తాసిల్దారుగారు సుబ్బరామయ్యవైపు చూస్తున్నారు. సుబ్బరామయ్య తాసిల్దారుగారివైపు చూస్తున్నాడు. ఇద్దరి ముఖాలలోనూ తొలినాటి జ్ఞాపకాల కోసం గింజుకుంటున్న సూచనలు కానవస్తున్నాయి. ఆఖరుకు తాసిల్దారు గారే జయించారు.

"నువ్వటోయ్ సుబ్బరామయ్యా! ఎంతగా మారిపోయావ్, ఏం కథ! అన్నట్టు ఈ తాలూకాలో నేనా మీ వూరు?"

సుబ్బరామయ్య కుర్చీ స్వీకరించ డాని కింకా జంకుతూనే వున్నాడు—

"గుర్తురావడంలేదా నేను! నీ వెనుక డస్కులో కూర్చునేవాణ్ణి. వెంకటేశ్వరరావుని! హిస్టరీ మేష్టరుగారిని గిరీశం అనేవాళ్ళుగదూ! ఆయనకు ప్రియశిష్యుడినైనందున నన్ను వెంకటేశం అంటుండేవాళ్ళు. అందుకు

తగ్గట్టుగా కొన్ని దుడుకుపనులుగూడా చేస్తుండేవాడివి. ఒకటి రెండుసార్లు పిరాచల్లి నీ చొక్కాగూడా ఖరాబుచేసి నట్టు జ్ఞాపకం....చూచావా శంకరం.... వాకు హైస్కూలు జీవితంనాటి స్నేహితులెవరూ లేరవి చెబుతూండేవాడిని. సుబ్బరామయ్య స్వయంగా విచ్చేశాడు....ఎందరోయీ బిడ్డలు?"

"ఇద్దరు మగబిడ్డలు. ఇద్దరాడబిడ్డలు...."

"బాగానేవుంది. పడవకు ఒడిదుడుకులు లేవన్నమాట! చాలాకాలానికి కలుసుకున్నాం. ఇప్పుడు వెళ్ళాలన్నా నీకు బస్సులులేవు. ఈ రోజంతా నా కోసం వేచి వుండడంతోనే సరిపోయింది గనుక ఈ పూట నీ కిక్కడే భోజనం! ....పీటలు వేయమంటావా శంకరం!"

సుబ్బరామయ్య యిరకాటంలో పడ్డాడు. హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో యితణ్ణి 'ఒరేయ్' అని పిలిచేపాటి చనువు తనకుండేది. ఇప్పుడు ఏకవచనంతో సంబోధించడానికైనా మనసొప్పడంలేదు. ఇక్కడినుంచి వీలైనంత త్వరగా బయటపడితే బాగుండును! కానీ, యితడు భోజనానికి వుండిపొమ్మంటున్నాడు! హోదాలో గొప్పవాడు. బాల్యస్నేహాన్ని పాటించి ఆతిధ్యం యివ్వదలచుకుంటున్నాడు. వద్దనడం ఏం బాగుంటుంది?

భోజనాలు కొనసాగుతుండగా శాసిలారుగారు తమ సంతానాన్ని మిత్రుడికి పరిచయం చేయసాగారు. "శంకరాన్ని చూచావుగా సుబ్బరామయ్యా! వాడే పెద్దవాడు. బి. కాం. ప్యాసై స్టేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. వీడి తరవాత యిద్దరాడపిల్లలు. పెద్దమ్మాయి పెళ్ళయింది. రెండో అమ్మాయి హాస్టల్లో వుంటూ కాలేజిలో చదువుకుంటోంది. అదిగో వాడే చిన్నబ్బాయి, చిట్టిబాబు!"

హాల్లోనుంచి వరాండావైపు వెళుతున్న చిట్టిబాబు ద్వారం దగ్గర ఆగి,

---

★ మేజిస్ట్రేటు : "పోట్లాట జరుగుతున్నప్పుడు నువ్వక్కడే వున్నావుకదా! ఫిర్యాదికి ఎందుకు సహాయం చెయ్యలేకపోయావ్?"

సాక్షి : "ముందే ఎల్లా తెలుస్తుందండి, ఎవరు ముద్దాయో, ఎవరు ఫిర్యాదో!"

సుబ్బరామయ్యవైపు కొరకొర చూడ సాగాడు—

"ఆ అబ్బాయిగారిని యిదివరకే చూచాను. ఉదయం ఒకసారి యిక్కడికి వచ్చానుగదూ ! అప్పుడు కనిపించాడు."

"నేను వూళ్ళో వున్నదీ, లేనిదీ చెప్పలేదన్నమాట !"

"ఇన్, అవుట్ అంటూ అక్కడొక బోర్డుండగా ప్రత్యేకంగా నేను చెప్పడం దేనికి నాన్నా !"

"అదీ పాయింటే ! కాదంటావా సుబ్బరామయ్యా !"

"వ్రేలెడంత వున్నాడో లేదో, తల బిరుసుతనం మాత్రం బోలెడు ..." పుస్తకం చేతబట్టుకుని మేడ మెట్లెక్కుతున్న శంకరం తమ్ముడివైపు చురచుర చూసాడు. అన్నదమ్ములిద్దరూ ఒకేసారిగా రంగంనుంచి తప్పుకున్నారు.

"పసితనం గదండీ మరి...." సుబ్బరామయ్య సర్దిచెప్పచూచాడు.

"అబ్బే, అదికాదులేవోయ్ సుబ్బరామయ్యా !"

"ఏదికాదు ?" సుబ్బరామయ్య తలపైకెత్తి సాభిప్రాయంగా తాసిల్దారుగారివైపు చూడసాగాడు. ఎంతకూ వివరణ లభించకపోయేసరికి మళ్ళీ అతడే ఉపక్రమించాడు—

"ఈ చిట్టిబాబు ఆ శంకరానికి తమ్ముడుగావడమే విచిత్రం !"

తాసిల్దారుగారు అటూ ఇటూ కలయజూచి మరెవ్వరూ వినడంలేదన్న నిర్ధారణకు వచ్చినట్టుగా "నీకో రహస్యం చెప్పనా సుబ్బరామయ్యా" అన్నాడు.

"అంత కంటేనా !"

"శంకరం పుట్టిననాటికి నేను గుమాస్తాని ! ఓ చిన్నపెంకుటింట్లో నివసిస్తుండే వాణ్ణి. కూరానారా తెచ్చుకోవాలంటే స్వయంగా సంచీ చేత పట్టుకుని మార్కెట్టుకు వెళ్ళి వచ్చేవాడిని. ఒక్క మా ఆవిడ పైనతప్ప ప్రపంచంలో మరెక్కడా నా అధికారం సాగేదికాదు. శంకరం ఓ గుమాస్తా కడుపున పుట్టాడు. పది పన్నెండేళ్ళ వరకూ యించు మించుగా అదే వాతావరణంలో పెరిగాడు...."

ఆశ్చర్యంతో వింటున్నాడు సుబ్బరామయ్య.

"చిట్టిబాబు సంగతలా కాదు.. వీడు బుడి బుడి నడకలు నేర్చుకునేసరికి నేను తాసిల్దారునై పోయాను...."

"మజ్జిగ వేసుకున్నారా" అంటూ హాల్లోకి వచ్చిన ఆ యింటి యిల్లాలు నోరు తెరచుకుని విగ్రహంలా కూర్చున్న సుబ్బరామయ్య వాలకాన్ని చూచి విస్తుపోయింది.

***